నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | HYDERABAD




కూకట్‌పల్లిలో..





# పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా..

తంగేడు.. బంతి.. చామంతి.. ఇలా తీరొక్క పూలతో భాగ్యనగరం మురిసిపోయింది. వివిధ ఆకృతుల్లో తయారు చేసిన బతుకమ్మలు మహిళల కళాభిరుచిని చాటి చెప్పాయి. 'ఎంగిలిపూల'తో మొదలైన పూల జాతర గురువారం సద్దుల బతుకమ్మతో ముగిసింది. 'పోయిరా గౌరమ్మ'.. మళ్లొచ్చే ఏడాదికి తిరిగి రావమ్మ' అంటూ.. ఆడబిడ్డలంతా బతుకమ్మను గంగమ్మ ఒడికి చేర్చారు. మరోవైపు ఉయ్యాల పాటలతో ట్యాంక్ బండ్ పరిసరాలు పులకించిపోయాయి. వందలాది మంది మహిళలు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ.. ఆడిపాడారు. అనంతరం హుస్సేన్‌సాగర్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



కూకట్‌పల్లిలో బతుకమ్మల నిమజ్జనం





గచ్చిబౌలిలోని టీఎన్‌జీవో కాలనీ..





## బల్దియా కమిషనర్‌కు

# కేంద్రం షాక్!

**ఏపీకి వెళ్లాల్సిందేనని ఆదేశం ● ఆమ్రపాలి అభ్యర్థనను తిరస్కరించిన కేంద్రం**

**జూన్ నెలాఖరున జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు**

**గతంలో వివిధ హోదాల్లో బాధ్యతల నిర్వహణ**

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : 2010 బ్యాచ్‌కు చెందిన ఆమ్రపాలికి కేంద్రం షాకిచ్చింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి మూడు నెలలు కాకముందే.. ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. తెలంగాణలో ఉన్న 11 మంది ఐఏఎస్‌లను ఏపీ క్యాడర్‌కు చెందిన వారిగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తప్పనిసరిగా ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో గ్రేటర్‌లో ఆమె సేవలు మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. 2010లో శిక్షణ పూర్తి చేసుకున్న ఆమ్రపాలి.. తొలుత వికారాబాద్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి నుంచి తెలంగాణ ప్రాంతంలోని జిల్లాల్లో పలు హోదాల్లో పనిచేశారు. ఆమె స్థానికత విషయంలో నెలకొన్న వివాదం నేపథ్యంలో.. అఖిల భారత సర్వీసుల్లో అధికారుల కేటాయింపు విషయంలో తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయం ఆమ్రపాలికి ఇబ్బందిగా మారింది. గతంలో ఆమె తనను తెలంగాణకు కేటాయించాలని చేసిన అభ్యర్థనను కూడా పరిగణనలోకి తీసుకోకుండా వెంటనే ఏపీలో రిపోర్టు చేయాలని కేంద్రం ఆదేశించింది. దీంతో అనివార్యంగానే తెలంగాణను విడిచి ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉండగా... ఆ జాబితాలో గతంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రోనాల్డ్ రాస్ కూడా ఉన్నారు.

### వికారాబాద్ టూ ఏపీ..

విశాఖపట్నం తన స్వస్థలంగా పేర్కొనడంతో ఆమ్రపాలిని ఏపీ క్యాడర్‌కు కేటాయించినట్లు తెలిసింది. గతంలో తనను తెలంగాణ స్థానికురాలిగా గుర్తించి తెలంగాణ క్యాడర్‌కు పంపాలని ఆమ్రపాలి క్యాట్‌ను ఆశ్రయించినా... ప్రయోజనం లేకుండా పోయింది. 2010లో వికారాబాద్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 2020 వరకు పలు శాఖల్లో పనిచేశారు. హైదరాబాద్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిగా, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌గా సేవలు అందించారు. అక్కడి నుంచి జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ఆమ్రపాలి, ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘంలోనూ పనిచేశారు. అనూహ్యంగా 2020లో ప్రధాని కార్యాలయం నుంచి పిలుపు రావడంతో కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌పై వెళ్లారు. కొంతకాలం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక సలహాదారురాలిగా పనిచేశారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడి నుంచి మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా చేయగా... జూన్ నెలాఖరులో జీహెచ్‌ఎంసీ కమిషనర్ పగ్గాలు అందుకున్నారు. కానీ బాధ్యతలు చేపట్టి, పాలనపై పట్టు తెచ్చుకుంటున్నలోపే ఏపీకి వెళ్లాలంటూ కేంద్రం ఆదేశించింది. దీంతో ఆమ్రపాలి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. గతంలో ఆమె చేసిన అభ్యర్థనను కేంద్రం తిరస్కరించడంతో... ఇక ఏపీకి వెళ్లడం అనివార్యమేనని ప్రభుత్వ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

# రేపు ట్రాఫిక్ ఆంక్షలు



సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : భారత్-బంగ్లాదేశ్ మధ్య ఉప్పల్ స్టేడియంలో శనివారం జరిగే టీ-20 క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు రాచకొండ సీపీ ఓ ప్రకటనలో తెలిపారు. మ్యాచ్‌ను తిలకించేందుకు వేలాదిగా సందర్శకులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో ఉప్పల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో నిర్దేశిత ప్రాంతాల నుంచి వాహనదారులు వెళ్లాల్సి ఉంటుందని సూచించారు. 12న సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11.50 గంటలకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని వెల్లడించారు.



## 24 గంటల్లో భారీ వర్షాలు


సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో రాగల 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. గురువారం గ్రేటర్ వ్యాప్తంగా తేలికపాటి జల్లులు కురిశాయి. గరిష్ఠం 31.2, కనిష్ఠం 23.8, గాలిలో తేమ 68 శాతంగా నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, రాగల 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు వివరించారు.

# రుణమాఫీకి రాంరాం..

**వేలాది మంది రైతులకు మొండి 'చేయి'**

**గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని సర్కారు**

మేడ్చల్, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): రుణమాఫీ పథకం కథ ముగిసినట్టేనా.. రుణమాఫీ ఇక కానట్టేనా.. అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 3,642 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపు కావడంతో పెదవి విరుస్తున్నారు. రుణమాఫీ పొందని రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు వేలాది మందికి రుణమాఫీ కాలేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. రుణమాఫీ పొందని వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో నేరుగా దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాంకేతిక కారణాలు చూపిస్తూ.. రుణమాఫీ చేయరా అంటూ ప్రశ్నిస్తున్నారు. రుణమాఫీపై ఆశలు వదులుకుంటున్నారు.



### 3,642 మందికే రుణమాఫీ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రుణమాఫీ పొందే రైతులు 26 వేల పైచిలుకు ఉంటే రుణమాఫీ అయింది మాత్రం 3,642 మందికే. రుణమాఫీ పొందని రైతుల వివరాలను సహకార సంఘాల్లో సేకరించి నివేదికలను ప్రభుత్వానికి పంపించగా, ఇప్పటి వరకు రుణమాఫీకి సంబంధించిన సమాచారం రాలేదని రైతులు పేర్కొంటున్నారు. రుణమాఫీపై సహకార సంఘాల చుట్టూ తిరిగినా.. అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. అసలు రుణమాఫీ చేస్తారా లేదా అనే విషయమై ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అన్నదాతలందరికీ రుణమాఫీ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తున్నారు. మరోవైపు అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడేమో సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం మరోసారి రైతులను మోసం చేసినట్లే అవుతుందంటున్నారు



# హెచ్‌ఎండీఏ తరలింపునకు బ్రేక్?

**మైత్రీవనంలోనే కార్యాలయం కొనసాగించేలా చర్యలు**

**అన్ని కార్యాలయాలను ఒకే చోటుకు తీసుకొచ్చే యోచన**

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : మైత్రీవనంలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్ నుంచి బేగంపేట పైగా ప్యాలెస్‌కు తరలించే పనులకు బ్రేక్ పడినట్లుగా తెలుస్తున్నది. ఆగస్టు మొదటి వారంలోనే హెచ్‌ఎండీఏ విభాగాలన్నింటినీ ఒకే చోటుకు తరలించేలా జీవోలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా పైగా ప్యాలెస్‌లో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ప్రస్తుతం ఇంటీరియర్ పనులు సాగుతుండగా... తాజాగా పైగా ప్యాలెస్‌కు కార్యాలయం తరలింపునకు బ్రేక్ పడినట్లు తెలిసింది. తరలింపునకు సంబంధించిన ఆరు నెలల కిందటే జీవో జారీ చేసి, తీరా ఇంటీరియర్ పనులు ముగిసిన తర్వాత తరలింపు నిలిపివేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్వర్ణజయంతి కార్యాలయానికి హెచ్‌ఎండీఏకు చెందిన ఇతర కార్యాలయాలను కూడా తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. పైగా ప్యాలెస్ విషయంలో ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని, హైడ్రా ఆఫీసును అక్కడే ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. అయితే దీనికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ పైగా ప్యాలెస్‌కు హెచ్‌ఎండీఏ తరలించొద్దని స్పష్టమైన సూచనలు ఇప్పటికే అధికారులకు ప్రభుత్వం చేసినట్లు సమాచారం.

# పెద్ద చెరువుపై చిన్నచూపు!

## హద్దుల నిర్ధారణకు ఆలస్యం

**సత్వరమే బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిని స్పష్టం చేయాలి**

**హెచ్‌ఎండీఏ అధికారులను ఆదేశించిన హైకోర్టు**

**అయినా కదలని యంత్రాంగం**

**నగరంలో 3వేలకు పైగా చెరువులు**

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : రామాంతాపూర్ పెద్ద చెరువు హద్దుల వ్యవహారంలో హెచ్‌ఎండీఏ లేక్స్ విభాగానికి చీవాట్లు పడుతూనే ఉన్నాయి. తాజాగా పెద్ద చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలవ్వగా, దీనిపై విచారణ జరిగింది. రెండు దశాబ్దాలుగా రామాంతాపూర్ పెద్ద చెరువు కబ్జాలు, ఆక్రమణలతో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ కుచించుకుపోయిందన్నారు. ఇప్పటికీ స్థానికులు చెత్తాచెదారం నింపడంతో కబ్జాలు నిత్యకృత్యంగా మారడంతో... హద్దుల నిర్ధారణ జరగాలన్నారు. 2016లో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించి.. 30 ఎకరాల మేర విస్తరించి ఉందని.. ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ ఇప్పటికీ ఫైనల్ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాలేదని హైకోర్టుకు వివరించారు. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ లేక్స్ విభాగం అధికారులు తక్షణమే పెద్ద చెరువు హద్దులను నిర్ధారించాలని, చెరువు ఎఫ్‌టీఎల్ 30 ఎకరాలు ఉందా లేదా అనే విషయాన్ని స్పష్టం చేస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఇక స్థానికుల నుంచి వచ్చే అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

### కదలని యంత్రాంగం..

మహానగరంలో చెరువుల హద్దులు నిర్ధారించడంలో హెచ్‌ఎండీఏ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. నగరంలో 3వేలకు పైగా చెరువులు ఉన్నా... సగం జలవనరులకు కూడా ఇప్పటివరకు హద్దులను నిర్ధారించలేకపోయింది. దీనికి అనేక కారణాలు ఉండగా.. శాఖల మధ్య సమన్వయం లోపం ప్రధానమని అధికారులు చెబుతున్నారు. ఇరిగేషన్ శాఖ ఇచ్చే చెరువుల మ్యాపులు అందుబాటులో లేకపోవడంతోనే నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా గతంలోనే పలు చెరువుల పరీవాహక ప్రాంతాల్లో కబ్జాలు, ఆక్రమణలు, నిర్మాణాలతో నిండిపోవడంతో.. హద్దుల నిర్ధారణ సాధ్యం కాదని, క్షేత్రస్థాయిలో పలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందనే నెపంతో.. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణపై అధికారులు దృష్టి పెట్టలేదు. కానీ ప్రస్తుతం చెరువుల పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలను నోటీసులు లేకుండా హైడ్రా కూల్చివేయడంతో.. నిర్మాణదారులు ముందుగానే కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో హద్దుల విషయంలో తమకున్న అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నారు. నగరంలో పలు చెరువుల విషయంలో ఇదే తరహాలో కోర్టులు ఆదేశిస్తే తప్ప.. అధికారులు కదలడం లేదు.



రామాంతాపూర్ పెద్ద చెరువు